క్లుప్తంగా

గ్రామాల్లో పారిశుద్ధ్యానికి శ్రద్ధ తీసుకోండి



కొల్లిపర: ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ బీవై విష్ణు ప్రసాద్ సూచించారు. శనివారం మండలం కేంద్రంలోని పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సైడ్ డ్రెయిన్లలో పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు పూడిక తీసిన తరువాత వచ్చిన వ్యర్థాలను వెంటనే తరలించి బ్లీచింగ్, చల్లాలని సూచించారు. మురుగునీరు నిల్వ లేకుండా ఉన్నప్పుడే దోమలు అభివృద్ధి అరికట్టవచ్చన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.

కరెంటు తీగలు తగిలి మూడు గేదెలు మృతి



పెదకాకాని: విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యానికి మూడు గేదెలు బలైన సంఘటన కొప్పురావూరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శాఖమూరి సాంబయ్య, శ్రీను శనివారం గ్రామ శివారు ప్రాంతానికి పశువుల్ని మేతకు తోలుకెళ్లారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మేత బాగా పెరిగి ఉండటంతో పాటు అదే ప్రదేశంలోకరెంటు తీగలు తెగి పడి ఉన్నాయి. ఉదయం కరెంటు తీగలు తెగి పడితే మధ్యాహ్నం వరకూ కూడా సిబ్బంది అటువైపు కూడా తిరిగి చూడలేదు. కనీసం సరఫరా కూడా నిలుపుదల చేయలేదు. మేత మేస్తున్న గేదెలు కరెంటు తీగలు తగిలి సంఘటనా ప్రదేశంలో యజమానుల ముందే విలవిల కొట్టుకుంటూ కన్నుమూశాయి. వాటి విలువ రూ. 2 లక్షల దాకా ఉంటుందని, విద్యుత్ శాఖ నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

భారతీయ విజ్ఞాన వ్యవస్థపై వ్యాస రచన పోటీలు

గుంటూరు రూరల్: చలపతి ఫార్మసీ కళాశాల, మోతడక కళాశాల, చలపతి పూర్వ విద్యార్థుల సంఘం, హైదరాబాద్ బలెంఫార్ ప్రైవేట్ లిమిటెడ్, మెడక్ జైంత్ హెల్త్‌కేర్ సంయుక్త ఆధ్వర్యంలో 'భారతీయ విజ్ఞాన వ్యవస్థలు' అనే అంశంపై జాతీయ స్థాయిలో వ్యాసరచన పోటీల్ని నిర్వహిస్తున్నట్లు చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో శనివారం వ్యాసరచన పోటీల కరపత్రాల్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆగస్టు 5వ తేదీలోపు ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలతో రూ. 100 రుసుంను ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని, గూగుల్ ఫామ్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యాసాల్ని ఈవీఈఎస్‌టీఎస్‌సీఎల్‌పీటీ జీ మెయిల్‌కు పంపాలని సూచించారు.

తెనాలిలో డెంగీ గుబులు

- ఈ ఏడాదిలో 24 మందికి డెంగీ నిర్ధారణ
- జాగ్రత్తలు తీసుకుంటే అరికట్టవచ్చంటున్న అధికారులు



జిల్లా వైద్యశాలలో ఓపీ వద్ద బారులు తీరిన రోగులు..

తెనాలిఅర్బన్: తెనాలి డివిజన్‌లో డెంగీ వ్యాధి విస్తరిస్తోంది. ఇటీవలి వర్షాలకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండటంతో దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు డెంగీ బారిన పడుతున్నారు. డివిజన్‌లో ఇప్పటి వరకు 24 మంది డెంగీ బారిన పడి, కోలుకున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. మరణాలు సంభవించికపోయినప్పటికి బాధితుల సంఖ్య పెరుగడం ఆందోళన కలిగిస్తోంది. తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో తెనాలి, మంగళగిరి, పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇటీవల తరచు వర్షాలు కురుస్తున్నాయి. అలాగే పలు పట్టణాలు, మండలాల్లో పారిశుద్ధ్య లోపం స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో విషజర్వాలు, డెంగీ, మలేరియా వంటివి వ్యాధుల బారిన ప్రజలు పడుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలలు, అర్బన్ హెల్త్ సెంటర్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు జర్వ పీడితులతో నిండుతున్నాయి. తెనాలి జిల్లా వైద్యశాలకు ప్రతి రోజు జర్వ బాధితులు 20 మంది వరకు వస్తున్నారు. అలాగే ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 10 మంది చొప్పున జర్వపీడితులు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరిలో కొందరికి డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు నిర్ధారణ అవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

విస్తరిస్తున్న డెంగీ..

తెనాలి రెవెన్యూ డివిజన్‌లో డెంగీ వ్యాధి కొంత ఉధ్రుతమవుతోంది. ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్స పొందే వారి వివరాలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు సేకరించి, ఆయా గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వారం క్రితం తెనాలి చెంచుపేటకు చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్‌లో ఉంటూ.. జ్వరంతో తెనాలి వచ్చాడు. అతనికి పరీక్షలు చేయగా డెంగీ అని నిర్ధారణ అయింది. వెంటనే అతడు జిల్లా వైద్యశాలలో చికిత్స పొంది కోలుకున్నాడు. ఈ ఘటన వెలుగు చూడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇలా అనేక పట్టణాలు, ప్రాంతాల్లో డెంగీ కేసులు వెలుగు చూస్తేనే ఉన్నాయి.

డెంగీ లక్షణాలు..

ఎడిస్ ఈజిప్ట్ అనే దోమ కాటు వల్ల డెంగీ వ్యాధి వస్తుంది. ఇది సోకిన వారికి తీవ్రమైన జ్వరం, నొసటపై తల నొప్పి, కంటి లోపల కదలికలు తగ్గుట, కండరాలు, కీళ్ల నొప్పులు రావడం జరుగుతుంది. వాంతి అయినట్లు అనిపిస్తుంది. నోరు ఎండిపోతు దాహం ఎక్కువగా అవుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలి. శరీరం మొత్తం కప్పేలా వస్త్రాలను ధరించాలి. ఇంటి పరిసరాల్లో ఉన్న పాత వస్తువులలో నీరు లేకుండా చూసుకోవాలి. ఇంటి తలుపులు, కిటికీలకు మెష్‌లను ఏర్పాటు చేసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగడం, వేడి వేడి ఆహారం తీసుకోవడం మంచిది.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి



తెనాలి డివిజన్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 24 డెంగీ కేసులు నమోదయ్యాయి. అందరూ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొంది, కొలుకున్నారు. పగలు కొట్టే దోమ వల్ల డెంగీ వస్తుంది. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందాలి. ప్రభుత్వ వైద్యశాలలో డెంగీ చికిత్సకు అవసరమైన మందులు, పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ అన్నపూర్ణ, డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ, తెనాలి

ఈ 'చెత్త' ఆలోచన ఎవరిదో..?

- ఒకచోట శుభ్రం..మరో చోట దుర్గంధం
- తెనాలి మున్సిపాలిటీ నిర్వాకం



రోడ్డు వెంబడి మురుగు కాల్వల్లోని పూడిక



రోడ్డ పక్కన దుర్గంధం వెదజల్లుతున్నచెత్త

తెనాలి: ఒకచోట పరిశుభ్రం చేస్తుంటే, మరో ప్రదేశాన్ని దుర్గంధం చేస్తారా.. ఇదెక్కడైనా ఉంటుందా..? కానీ, తెనాలి మున్సిపాలిటీలో ఈ విధానం నడుస్తోంది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలపై మున్సిపల్ అధికారులలు ఆగమేఘాలపై స్పందిస్తూ పట్టణంలోని ప్రధాన డ్రెయినేజీపై దృష్టి సారించారు. పూడిక తీయిస్తున్నారు. అంతవరకూ బాగానే ఉంది.. ఇందుకు మున్సిపాలిటీ అధికారులను అభినందించాల్సిందే. కానీ, తీసిన పూడిక, అందులోని చెత్తాచెదారం నిక్షేపంలాంటి రోడ్డు పక్కన ట్రాక్టర్ల కొద్దీ గుమ్మరిస్తారా ఎవరైనా!.. బుర్రిపాలెం రోడ్డులో పాలార్రి కాల్వ అంచునే మట్టి రోడ్డుంది. నాజరు పేట, రామలింగేశ్వర పేటకు చెందిన ప్రజలు బుర్రిపాలెం రోడ్డులోకి రావాలంటే ఈ మార్గం రింగ్ రోడ్డుగా ఉపకరిస్తోంది. నిత్యం ఎందరో ఈ రోడ్డుపై ప్రయాణిస్తుంటారు. కాల్వల నుంచి తొలగించిన మురుగు, చెత్తను కుమ్మరించేందుకు మున్సిపాలిటీకి ఈ రోడ్డే అడ్డాగా మారింది. రోడ్డు వెంట టన్నుల కొద్దీ చెత్తను ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. స్థానికులు అభ్యంతర పెట్టినా ఖాతరు చేయడం లేదు. మురుగుతో దుర్గంధం అనివార్యమైంది. వర్షాలు కురిస్తే, ఆ బురద, మట్టి...అంతా రోడ్డుపైకి జారి అధ్వానంగా మారుతోంది. ఈ మట్టి రోడ్డు స్థానంలో తారు లేదా సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. సరిహద్దు వివాదం ఏదో తలెత్తడంతో అది పెండింగ్‌లో ఉండిపోయింది. ఇకనైనా నిక్షేపం లాంటి రోడ్డును పాడుచేయడం ఆపాలని జనం కోరుతున్నారు.

బోధనలో మెళకువలు తెలుసుకోండి

రీజినల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వరరెడ్డి



తెనాలిఅర్బన్: బోధనలోని మెళకువలను ఉపాధ్యాయులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కొత్త పేటలోని సెయింట్ జాయింట్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో జరుగుతున్న డివిజనల్ స్థాయి టీచింగ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు శిక్షణ ద్వారా నేర్చుకున్న తమ అనుభావాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు బోధన విధానాలపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం ట్రెనింగ్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు లక్ష్మీనారాయణ, జయంతిబాబు, ఉపాధ్యాయులు పి.దప్పు, యు.ప్రసాద్, జీవీ బాలసుందర్, ఎం.అభిగయల్, ఎస్.విజయలక్ష్మి, కె.శ్రీమన్నారాయణ, కె.పద్మావతి, బీహెచ్ శ్రీధర్, జయప్రకాశరావు, కో–ఆర్డినేటర్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా మూడు బుట్టల విధానం అమలు

మున్సిపల్ కమిషనర్ శేషన్న



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: మూడు బుట్టల విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని 14 ,31 వార్డులలో శనివారం ఆయన పర్యటించారు. ఆయా వార్డులలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. చెత్త సేకరణపై ఆరా తీశారు. ప్రతి రోజు చెత్తను సేకరించాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

తహసీల్దారు శ్రీనివాసులు బదిలీ



తహసీల్దారు శ్రీనివాసులును సత్కరిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

కొల్లిపర: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా బదిలీపై నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్ ఎన్. శ్రీనివాసులు శనివారం ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీవో బి.వై విష్ణుప్రసాద్ ఆయనను శాలువాతో సత్కరించారు. మండల ఇన్‌చార్జి తహసీల్దారుగా జె.వెంకటసూర్యనారాయణమూర్తి బాధ్యతలు చేపట్టారు. వీఆర్వోలు, కంప్యూటర్ ఆపరేటర్ ఈమని సురేంద్ర రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి క్రైస్తవ పుస్తక ప్రదర్శన

తెనాలిరూరల్: ఈ నెల 30 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు క్రైస్తవ పుస్తక ప్రదర్శను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలిలోని పుట్టి నాగేశ్వరరావు ఫంక్షన్ హాలు(పాత సత్యనారాయణ టాకీసు)లో ప్రతి రోజు ఉదయం తొమ్మిది నుండి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. వివరాలకు 961855 6483, 81220 59498 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బంధువులపై రౌడీ షీటర్ దాడి

తెనాలిరూరల్: ఆస్తి విషయమై ఘర్షణ పడి బంధువులపైనే రౌడీషీటర్ దాడి చేసి, గాయపర్చిన ఘటన మండలంలోని పెదరావూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం పెదరావూరుకు చెందిన వృద్ధురాలు శుక్రవారం మృతి చెందగా శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు వెళ్లిన కఠెవరానికి చెందిన రౌడీషీటర్ బారీ సైదా వృద్ధురాలి ఆస్తి విషయమై బంధువులతో ఘర్షణపడ్డాడు. రాడ్డుతో పలువురిపై దాడి చేసి, తీవ్రంగా గాయపర్చాడు. దీనిపై శనివారం రాత్రి వరకు రూరల్ పోలీసులకు లిఖిత పూర్వక ఫిర్యాదు అందలేదు. తమకు వచ్చిన సమాచారం మేరకు బారీ సైదా కోసం వెతుకులాట ప్రారంభించారు.

వ్యాపారిపై దాడి కేసులో పది మంది అరెస్ట్

తెనాలిరూరల్: అనధికార కట్టడం వివాదంలో వ్యాపారిపై దాడి చేసిన కేసులో రౌడీషీటర్ సహా 10 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణంలోని నందులపేటకు చెందిన వ్యాపారి అంచె నరేంద్ర కుమార్‌పై అదే ప్రాంతానికి చెందిన సుమారు 20 మంది ఈ నెల 25వ తేదీన దాడి చేసి గాయపర్చిన సంగతి తెలిసిందే. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన టూ టౌన్ పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో రౌడీషీటర్ కొడాలి గోపికృష్ణ అలియాస్ జైంటీ నిందితుడిగా ఉండడంతో న్యాయమూరి ఎదుట హాజరుపరచగా స్టేషన్ బెయిలు ఇచ్చే కేసు అని పేర్కొన్న న్యాయమూర్తి రౌడీషీటర్‌కు రిమాండ్ విధించేందుకు నిరాకరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొల్లిపర: మండల పరిధిలోని దావులూరు అడ్డరోడ్డు వద్ద కళాశాల వ్యాన్ ఢీకొట్టడంతో ఓ యువకుడు తీవ్రగాయాలతో మృతి చెందిన ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. దీనిపై స్థానికుల కథనం ప్రకారం మండలంలోని జెముడుబాడు గ్రామానికి చెందిన ఈదా వెంకటరెడ్డి (40) అనే యువకుడు తన టీవీఎస్ స్కూటీ పై పొలానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కళాశాల వ్యాన్ ఒక్క సారిగా ఢీకొట్టడంతో అతనికి తలకు తీవ్రగాయాలై రోడ్డు పై పడిపోయాడు. వెంటనే స్థానికులు గమనించి, వ్యాన్ నిలిపి వేసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలిస్తుండగా దారి మధ్యలోని మృతి చెందినట్లు తెలిపారు. వెంకటరెడ్డి జెముడుబాడు గ్రామం నుంచి వచ్చి దావులూరు అడ్డరోడ్డు సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకుని జీవిస్తున్నట్లు తెలుస్తోంది. మృతుడికి భార్య, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



అబ్దుల్ కలాం చిత్రపటానికి మాజీ మంత్రి ఆలపాటి, టీడీపీ నాయకుల నివాళి



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద ప్రముఖుల శ్రద్ధాంజలి

తెనాలిరూరల్: మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని శనివారం పలువురు ఘన నివాళులర్పించారు. బుర్రిపాలెం రోడ్డులోని బీజేపీ పట్టణ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్‌రాయుడు అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు టి.అనంతాచార్యులు, వాసుదేవ నాయుడు, కనక దుర్గ, వేణు, హనుమంతరావు పాల్గొన్నారు.


- స్థానిక రామలింగేశ్వర పేటలోని టీడీపీ కార్యాలయంలో అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పార్టీ నాయకులతో కలిసి కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. హరిప్రసాద్, ఖుద్దుస్, పూర్ణచంద్, అహ్మద్ ఖాన్, అహ్మద్, ఇర్ఫాం పాల్గొన్నారు.
- ఏపీ నవ చైతన్య బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు మేడిబోయిన గంగాయాదవ్ మార్కెట్ సెంటర్‌లోని కార్యాలయంలో అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. భీష్మ పాములు, గంగాదేవి, యలమంద, శ్రీనివాసరావు, విశ్వనాథ శివశంకర్ పాల్గొన్నారు.
- ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని ఐక్య వేదిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి వ్యవస్థాపకుడు అక్కిదాసు కిరణ్‌కుమార్, కౌన్సిలర్ యాతాటి అనిల్, అశోక్, జస్వంత్, షేక్ అన్సారీ, సయ్యద్ గౌస్, సాల్మన్, ప్రకాష్ నివాళులర్పించారు.

ఏపీజే అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం

తెనాలి: రక్షణ రంగంలో భారత దేశాన్ని సమున్నత స్థానంలో నిలిపిని ప్రముఖ శాస్త్రవేత్త, రాష్ట్రపతిగా దేశానికి ఎనలేని సేవలందించిన ఏపీజే అబ్దుల్ కలాం చిరస్మరణీయులని, నేటి యువతరం ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. కాలేషా–మీరావలి, గంగానమ్మ మిత్ర మండలి, అబ్దుల్ కలాం సేవా సమితి, గ్యార్మీ జెండా కమిటీ సంయుక్త నిర్వహణలో శనివారం స్థానిక గంగానమ్మ పేటలోని శివాలయం వద్ద అబ్దుల్ కలాం 9వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం వివిధ సేవా కార్యక్రమాలు జరిపారు. రెడ్‌క్రాస్ తెనాలి శాఖ, తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. 'మిస్సైల్ మ్యాన్' అబ్దుల్ కలాం వర్ధంతిని ఏటా నిర్వహిస్తూ, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిని ఆయన అభినందించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లను అతిథులు అందజేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, డాక్టర్ రియాజ్ ఖాన్ దంపతులు, మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకటరమణారావు, షేక్ జాకీర్ హుస్సేన్, రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి చైర్ పర్సన్ ముమ్మనేని భానుమతి, వివిధ రాజకీయ పార్టీల నేతలు బూరెల దుర్గాప్రసాద్, అక్కిదాసు కిరణ్‌కుమార్, అడపా సంపత్‌రాయుడు, దాసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లార్వాను నిర్వీర్యం చేసే గంబూషియా చేపలు

జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం



నీటి కుంటలో చేపలు వదులుతున్న మురళీకృష్ణ సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: గంబూషియా చేపలను చెరువులు, నీటి కుంటలలో వదలడం వలన అవి దోమల లార్వాను నిర్వీర్యం చేస్తాయని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. హట్కో కాలనీలోని నీటి కుంటల్లో శనివారం గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంటల్లో నీరు నిల్వ ఉండటం వలన దోమల వ్యాప్తి ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. దానిని నియంత్రించేందుకు ఇవి ఎంతో దోహదపడతాయన్నారు. నీటి నిల్వల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యశాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి రాజునాయక్, శివగణేష్, తెనాలి సహాయ అధికారి చెరసాని ప్రభాకర్‌రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, పట్టణ, మండల సబ్‌యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగాల పున్నారెడ్డి, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు గుద్దంటి రవికుమార్, సూపర్ వైజర్స్ దీపాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.